# సాక్షి పార్వతీపురం మన్యం

మంగళవారం । 11 । ఫిబ్రవరి । 2025




## మరుగుదొడ్ల నిధులు మాయం

రాజాం పట్టణం డోలపేట జెడ్పీ హైస్కూల్‌లో ఆధునికీకరణ నిమిత్తం మంజూరైన నిధులు పక్కదారి పట్టాయి. -8లో



## రామతీర్థంలో నేడు రథయాత్ర

సుప్రసిద్ధ పుణ్యక్షేత్రం రామతీర్థంలో మంగళవారం రాత్రి రథయాత్ర నిర్వహణకు ఆలయ అధికారులు ఏర్పాట్లు పూర్తిచేశారు. -8లో



## తరగతులకు వెళ్లండి -8లో

కళాశాలకు వీసీఐ గుర్తింపు సమస్యను పరిష్కరిస్తామని, తరగతులకు వెళ్లాలని విద్యార్థులకు తిరుపతి శ్రీ వెంకటేశ్వర వెటర్నరీ యూనివర్సిటీ వీసీ జేవీ రమణ సూచించారు.

## న్యూస్‌రీల్

### విధుల్లో నిర్లక్ష్యం వహిస్తే చర్యలు

- ఇద్దరు వీఆర్వోల సస్పెండ్

పార్వతీపురం: రెవెన్యూ సిబ్బంది విధుల్లో నిర్లక్ష్యం వహిస్తే చర్యలు తప్పవని కలెక్టర్ ఎ. శ్యామ్‌ప్రసాద్ హెచ్చరించారు. మ్యుటేషన్ల పరిష్కారంలో వీఆర్వోలు అలసత్వం వహించడం పట్ల ఆయన ఆగ్రహం వ్యక్తం చేశారు. సాలూరు మండలం శివరాంపురం సచివాలయం వీఆర్వో దాడి చిన్నయ్య, సీతంపేట మండలం పుల్లిపుట్టి సచివాలయ వీఆర్వో ఎ.అయ్యప్ప విధుల్లో అలసత్వం వహించడంతో క్రమశిక్షణ చర్యల్లో భాగంగా ఇద్దరినీ సస్పెండ్ చేసినట్లు తెలిపారు. మరో వీఆర్వోకు చార్జిమెమోను అందజేశామన్నారు. రెవెన్యూ సభలు, రీ సర్వేల్లో వచ్చిన మ్యుటేషన్లను పరిష్కరించాలని ఈ నెల 7న వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించి ఆదేశాలు జారీ చేసినప్పటికీ నిర్లక్ష్యం వహించడం వల్ల సస్పెండ్ చేసినట్లు తెలిపారు. ఇకపై ఏ ఒక్క వీఆర్వో, విలేజ్ సర్వేయర్ విధుల్లో అలసత్వం వహించినా కఠిన చర్యలు తీసుకుంటామన్నారు.

### మాటల్లో పెట్టి.. బంగారు ఆభరణాలు అపహరణ



బంగారు ఆభరణాల చోరీకి పాల్పడినట్లు అనుమానిస్తున్న మహిళలు వీరే...

పాలకొండ రూరల్: మాటల్లో పెట్టి బంగారు ఆభరణాలు అపహరించుకుపోయిన సంఘటన పాలకొండలో చోటుచేసుకుంది. వివరాల్లోకి వెళితే.. పట్టణంలోని మణికంఠ జ్యూయలరీ దుకాణానికి సోమవారం సాయంత్రం మూడు గంటల సమయంలో నలుగురు మహిళలు బంగారం కొనుగోలు కోసం వచ్చారు. వారికి షాపు యజమాని గుమ్మడి సింధు, సిబ్బంది ఆభరణాలు చూపించారు. అయితే కిలేడీలు వాటిని చూస్తున్నట్లు నటిస్తూ వాటి స్థానంలో నకిలీ ఆభరణాల ఉంచి అసలైన వస్తువులు కాజేశారు. కొద్దిసేపటికి వస్తువులు నచ్చలేదని చెబుతూ బయటకు వచ్చేశారు. అయితే బంగారు ఆభరణాలు కాజేసినట్లు గుర్తించిన యజమాని సింధు వెంటనే బయటకు వచ్చి కేకలు వేయగా ..అప్పటికే మోసగాళ్లు ఆటోలో కోటదుర్గమ్మ దేవస్థానం వైపు వెళ్లిపోయారు.

### ముగిసిన నామినేషన్ల పర్వం

- ఉత్తరాంధ్ర ఉపాధ్యాయ ఎమ్మెల్సీ స్థానానికి చివరి రోజు రెండు నామినేషన్ల దాఖలు
- మొత్తం 10 మంది నామినేషన్లు
- రేపు పరిశీలన, 13న ఉపసంహరణ

మహారాణిపేట (విశాఖ):

ఉత్తరాంధ్ర ఉపాధ్యాయ ఎమ్మెల్సీ స్థానానికి నామినేషన్ల ప్రక్రియ సోమవారంతో ముగిసింది. ఆఖరి రోజు స్వతంత్ర అభ్యర్థులు పెదపెంకి శివప్రసాద్, సుంకర శ్రీనివాసరావు రిటర్నింగ్ అధికారి, కలెక్టర్ ఎం.ఎన్.హరేందిర ప్రసాద్‌కు నామినేషన్ పత్రాలను అందజేశారు. ఫిబ్రవరి 3వ తేదీన నోటిఫికేషన్ వెలువడగా, నామినేషన్ల పర్వం ముగిసే సరికి 10 నామినేషన్లు దాఖలైనట్టు కలెక్టర్ వెల్లడించారు. మంగళవారం నామినేషన్ల పరిశీలన, 13న ఉపసంహరణ ఉంటుంది.

**నామినేషన్లు వేసిన అభ్యర్థులు**

కోసూరు రాధాకృష్ణ, పాకలపాటి రఘువర్మ, సత్తలూరి శ్రీరంగ పద్మావతి, కోరెడ్ల విజయగౌరి, నూకల సూర్యప్రకాశ్, రాయల సత్యనారాయణ, గాదె శ్రీనివాసులు నాయుడు, పోతల దుర్గారావు, పెదపెంకి శివప్రసాద్, సుంకర శ్రీనివాసరావు నామినేషన్లు దాఖలు చేశారు.

## కొటియాపై అదే కవ్వింపు!

- రెచ్చగొట్టేలా ఒడిశా అధికారులు, పోలీసుల చర్యలు
- తెలుగు బోర్డులు ఎత్తుకెళ్లి, నీటి ట్యాంకు పైపుల పనులను అడ్డుకున్న వైనం
- మౌనం వహిస్తున్న ఏపీ పాలకులు



ఒడిశా అధికారుల కవ్వింపు చర్యలు, అభివృద్ధి పనులను అడ్డుకోవడాన్ని ఖండిస్తూ ఆదివాసీ గిరిజన సంఘం నిరసన

సాక్షి, పార్వతీపురం మన్యం:

కొటియాపై ఒడిశా ప్రభుత్వానిది అదే కవ్వింపు ధోరణి.. రెచ్చగొట్టే వైఖరి.. ఏపీ నుంచి చేపడుతున్న అభివృద్ధి పనుల అడ్డగింత.. ఎన్నో ఏళ్లుగా ఇదే పరిస్థితి. తాజాగా మరోసారి అక్కడి అధికారులు తమ ఆధిపత్యాన్ని ప్రదర్శించారు. ఒడిశా అధికారుల చర్యలపై కొటియా గ్రామాల ప్రజలు, గిరిజన సంఘాల నాయకులు ఆందోళనకు దిగారు.

### పోలీసుల కవ్వింపు చర్యలు

ఆంధ్రా–ఒడిశా సరిహద్దులోని వివాదాస్పద కొటియా గ్రామాల్లో పోలీసుల కవ్వింపు చర్యలు కొనసాగుతున్నాయి. ఇటీవల గంజాయిభద్ర పంచాయతీ దిగవశెంబిలో అంగన్‌వాడీ కేంద్రానికి వచ్చి అక్కడ తెలుగులో ఉన్న బోర్డులను, చార్టులను పోలీసులు ఎత్తుకెళ్లారు. ఆంధ్రా తరఫున అంగన్‌వాడీ కేంద్రం నడపడంపై అభ్యంతరం వ్యక్తం చేస్తూ.. కేంద్రానికి ఎందుకు ఇల్లు అద్దెకు ఇచ్చారని యజమానిని భయభ్రాంతులకు గురిచేశారు. గత శనివారం ధూళిభద్ర వద్ద జల్‌జీవన్ మిషన్ కింద వాటర్ ట్యాంకు పైపుల నిర్మాణానికి తీసుకొచ్చిన వ్యాన్, సిమెంట్ సామగ్రిని అడ్డుకున్నారు. వ్యాన్‌తో సహా కొటియా పోలీస్‌స్టేషన్‌కు తరలించారు. పనులకు వచ్చిన కూలీల సెల్‌ఫోన్లను లాక్కొన్నారు. ఇటువంటి ఘటనల నేపథ్యంలో కొటియా గ్రూపు గ్రామాల్లో పనిచేసేందుకు ఆంధ్రా అధికారులు, సిబ్బంది భయపడుతున్నారు. తరచూ ఒడిశా పోలీసులు అక్కడ విధి నిర్వహణకు వెళ్లే ఆంధ్రా ఉద్యోగులను అడ్డుకుంటూ, బెదిరింపులకు పాల్పడుతున్నారు.

### పెత్తనం కోసం రెచ్చగొట్టే ధోరణి

గత సార్వత్రిక ఎన్నికలకు ముందు కూడా ఇదే తరహాలో ఒడిశా ప్రభుత్వం, అధికారులు కవ్వింపు చర్యలకు దిగారు. కొటియాలోని గంజాయిభద్రలో గిరిజనుల ఇళ్లకు విద్యుత్ మీటర్లను ఏపీ అధికారులు వేస్తుండగా.. అడ్డుకున్నారు. దీంతోపాటు, సరిహద్దు భూభాగమైన ఎగువశెంబి వద్ద మైనింగ్ తవ్వకాలకు ఒడిశా యంత్రాంగం గుట్టుచప్పుడు కాకుండా సిద్ధమైంది. దీన్ని స్థానిక గిరిజనులు అడ్డుకున్నారు. ఆంధ్రా–ఒడిశా సరిహద్దులోని 21 కొటియా గ్రామాలపై పెత్తనం కోసం ఒడిశా ప్రభుత్వం దశాబ్దాలుగా ప్రయత్నాలు సాగిస్తూనే ఉంది. ఏపీకి పోటీగా అక్కడ అభివృద్ధి పనులు చేస్తోంది. పథకాలు అందిస్తోంది. అందుకే అక్కడి ప్రజలకు రెండు వైపుల నుంచి రేషన్ కార్డులు, ఇతర సంక్షేమ పథకాలు అందుతున్నాయి. రెండు రాష్ట్రాల ఓటు హక్కు కూడా ఉంది. మధ్యమధ్యలో రెచ్చగొట్టేలా అక్కడి పోలీసులు కవ్వింపు చర్యలకు దిగుతున్నారు. 2019 ఎన్నికల సమయంలోనూ ఒడిశా అధికారులు పెద్ద వివాదమే సృష్టించారు. ఆంధ్రా అధికారులు ఎంత శాంతంగా సమస్యను పరిష్కరిద్దామని చూస్తున్నప్పటికీ.. అటు నుంచి స్పందన రావడం లేదు. సరిహద్దు గ్రామాల్లో ఏపీ ప్రభుత్వం నిర్వహిస్తున్న అభివృద్ధి పనులను ప్రతిసారీ అడ్డుకోవడం ఒడిశా ప్రభుత్వానికి, అధికారులకు అలవాటుగా మారిపోయింది. వాస్తవానికి ఈ ప్రాంతాల్లో స్టేటస్ కో అమల్లో ఉన్నప్పటికీ.. అవేవీ వారికి పట్టడం లేదు. గిరిశిఖర గ్రామాల్లో అభివృద్ధి పనులను అడ్డుకుంటున్నా.. స్థానిక గిరిజనులను ఇబ్బందులు పెడుతున్నా రాష్ట్రంలో అధికారంలో ఉన్న రాష్ట్రంలోని కూటమి ప్రభుత్వం, అధికారులు స్పందించకపోవడం గమనార్హం. గతంలో కొటియా వివాదాన్ని అప్పటి వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంపై నెట్టివేసి.. బురద జల్లేందుకు ప్రయత్నించి, రాజకీయ లబ్ధి పొందేందుకు చూసిన జిల్లాకు చెందిన ప్రస్తుత కూటమి పెద్దలు.. నేడు మౌనం పాటిస్తుండడంపై విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. ఏపీలో బీజేపీతో కూడిన కూటమి ప్రభుత్వం అధికారంలో ఉంది. అటు ఒడిశాలోనూ బీజేపీ ప్రభుత్వానిదే అధికారం. ఈ నేపథ్యంలో దశాబ్దాల నాటి వివాదాన్ని పరిష్కరించేందుకు ఇదే సరైన సమయమని ప్రజాసంఘాల నాయకులు అంటున్నారు. దీనిపై ఆంధ్రాలోని కూటమి నేతలు ఏ విధంగా స్పందిస్తారో చూడాలి.



ఒడిశా పోలీసులు తీసుకెళ్లడంతో కొటియా పోలీస్ స్టేషన్ వద్ద ఉన్న కూలీలు, జల్‌జీవన్ మిషన్ సామగ్రి వ్యాన్

## పకడ్బందీగా పదోతరగతి పరీక్షలు నిర్వహించాలి

- కలెక్టర్ శ్యామ్ ప్రసాద్

పార్వతీపురం: జిల్లాలో మార్చి 17 నుంచి ఏప్రిల్ 1వ తేదీ వరకు జరగనున్న పదోతరగతి పరీక్షలను పగడ్బందీగా నిర్వహించాలని కలెక్టర్ ఎ.శ్యామ్‌ప్రసాద్ సంబంధిత అధికారులను ఆదేశించారు. కలెక్టర్ కార్యాలయంలో అధికారులతో సోమవారం నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. జిల్లా వ్యాప్తంగా 10,455 మంది విద్యార్థులు ఈ ఏడాది పదోతరగతి పరీక్షలు రాయనున్నారని, ఉదయం 9 నుంచి మధ్యాహ్నం 12.45 గంటల వరకు పరీక్షలు జరుగుతాయన్నారు. పరీక్ష కేంద్రాల్లో తాగునీరు, విద్యుత్ సరఫరా అంతరాయం లేకుండా చూడాలన్నారు. ప్రథమ చికిత్స కిట్లతోపాటు ఓఆర్‌ఎస్ ప్యాకెట్లను అందుబాటులో ఉంచాలన్నారు. పరీక్ష కేంద్రాల వద్ద 144సెక్షన్ అమలు చేయాలని ఆదేశించారు. డీఈఓ ఎన్. తిరుపతినాయుడు మాట్లాడుతూ జిల్లాలో 220 పాఠశాలలకు చెందిన 10,367మంది రెగ్యులర్, 88 మంది ప్రైవేటుగా పరీక్షలకు హాజరు కానున్నారన్నారు. జిల్లాలోని 67 పరీక్ష కేంద్రాలకు 67మంది చీఫ్ సూపరింటెండెంట్లు, మూడు ఫ్లయింగ్ స్క్వాడ్‌లను నియమించామని తెలిపారు. ఏపీ సార్వత్రిక విద్యాపీఠం ఆధ్వర్యంలో మార్చి 17 నుంచి 28వ తేదీ వరకు 10వ తరగతి పరీక్షలు, మార్చి 3 నుంచి 15వ తేదీ వరకు ఇంటర్మీడియట్ పరీక్షలు జరుగుతాయన్నారు. పదోతరగతి పరీక్షలకు 560మంది, ఇంటర్మీడియట్‌కు 436 మంది విద్యార్థులు హాజరుకానున్నట్లు వెల్లడించారు. సమావేశంలో డీఆర్వో కె.హేమలత, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ శ్యామ్‌ప్రసాద్

## 1/70 చట్టాన్ని సవరిస్తే... సంక్షోభంలో గిరిజనుల భవిష్యత్

- మాజీ డిప్యూటీ సీఎం రాజన్నదొర

సాలూరు: ఏజెన్సీలో 1/70 చట్టాన్ని సవరించినప్పుడే అభివృద్ధి సాధ్యమన్న స్పీకర్ అయ్యన్నపాత్రుడు వ్యాఖ్యలకు నిరసనగా మంగళ, బుధవారాల్లో జరగబోయే మన్యం బంద్‌కు ఓ గిరిజనుడిగా సంపూర్ణ మద్దతు ఇస్తున్నట్టు మాజీ డిప్యూటీ సీఎం పీడిక రాజన్నదొర ప్రకటించారు. సాలూరు పట్టణంలోని తన స్వగృహంలో విలేకరులతో సోమవారం మాట్లాడారు. 1/70 చట్టాన్ని సవరిస్తే గిరిజనుల భవిష్యత్ సంక్షోభంలో కూరుకుపోతుందన్నారు. 1/70 చట్టం ప్రకారం గిరిజన ప్రాంతంలో భూమిపై పూర్తి హక్కు గ్రామసభ, పంచాయతీ, గిరిజన సలహామండలికి ఉంటుందని, ఇదే విషయాన్ని 1997లో సమతా జడ్జిమెంట్‌లో సుప్రీంకోర్టు స్పష్టం చేసిందని పేర్కొన్నారు. గిరిజన ప్రాంతంలో సెంటు భూమి సేకరించాలన్నా గ్రామసభ ఆమోదం, పంచాయతీ తీర్మానం అవసరమని, అనంతరం గిరిజన సలహామండలికి వెళ్తుందన్నారు. చంద్రబాబు అధికారంలోకి వచ్చిన ప్రతిసారి గిరిజనుల హక్కులు, చట్టాల సవరణ కోసం ప్రయత్నిస్తూ గిరిజనులకు రక్షణ కరువవుతోందన్నారు. గతంలో పీసా చట్టాన్ని సవరించి గిరిజన ప్రాంతాన్ని బడాబాబులకు కట్టబెట్టాలని ప్రయత్నించారని ఆరోపించారు.



మాట్లాడుతున్న మాజీ డిప్యూటీ సీఎం పీడిక రాజన్నదొర

రాష్ట్రంలో సుమారు 554 గ్రామాలను షెడ్యూల్ గ్రామాలుగా గుర్తించే ప్రక్రియ కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల మధ్య దశాబ్దాలుగా నలుగుతోందన్నారు. సాలూరు మండలం జగ్గుదొరవలసలో ఏజెన్సీ సర్టిఫికెట్ల కోసం గిరిజనులు ఆందోళన చేసినప్పుడు అక్కడకు నాటి ప్రతిపక్ష నేతలు సంధ్యారాణి, భంజ్‌దేవ్‌లు వెళ్లి అధికారంలోకి రాగానే ఏజెన్సీ సర్టిఫికెట్లు ఇప్పిస్తానని హామీ ఇచ్చారని, ఆ హామీ ఎప్పుడు అమలు చేస్తారని ప్రశ్నించారు. కుడుమూరు భూములు గిరిజనులకు ఇస్తామని నాడు సంధ్యారాణి తెలిపారని, జీఓ 3ను పునరుద్ధరిస్తామని సంధ్యారాణి, నారా లోకేష్‌లు హామీ ఇచ్చారని గుర్తుచేశారు. దీనిపై గిరిజన సంఘాలు నిలదీయాలని కోరారు. సమావేశంలో మోహన్, గోవింద, రామకృష్ణ, కళ్యాణ్ తదితరులు పాల్గొన్నారు.

## రిమాండ్ ఖైదీ ఆత్మహత్యాయత్నం

- కోర్టు భవనంపై నుంచి దూకిన ఖైదీ

విజయనగరం క్రైమ్: సబ్‌జైల్ నుంచి ఎస్కార్ట్ వాహనంలో విజయనగరం కోర్టుకు సోమవారం హాజరైన రిమాండ్ ఖైదీ.. అదే కోర్టు భవనంపై నుంచి దూకి ఆత్మహత్యాయత్నానికి పాల్పడ్డాడు. దీనికి సంబంధించి టూటౌన్ పోలీసులు తెలిపిన వివరాలిలా ఉన్నాయి. అనకాపల్లి జిల్లా పాయకరావుపేటకు చెందిన ఐ.త్రిమూర్తులు ఐదేళ్ల కిందట విజయనగరం అమ్మవారి జాతరలో పరిచయమైన ఓ యువతిని ప్రేమించాడు. ఆమె ఇద్దరు కవల పిల్లలకు జన్మనిచ్చింది. పెళ్లి చేసుకోకపోవడంతో ఆమె టూటౌన్ పోలీసులకు ఫిర్యాదుచేసింది. ఆ మేరకు కేసు నమోదు చేసిన పోలీసులు అరెస్టు చేసి, రిమాండ్‌కు తరలించారు. జిల్లా కోర్టులో కేసు నడుస్తోంది. కోర్టు వాయిదాలకు హాజరుకాకపోవడంతో కోర్టు అరెస్ట్ వారెంట్ జారీచేసింది. గత నెలలో అనకాపల్లిలో పట్టుకుని ఆయనను అరెస్టు చేసి సబ్‌జైల్‌లో ఉంచారు. ఎస్కార్ట్ సాయంతో కోర్టు వాయిదాకు తీసుకువచ్చారు. వాయిదాకు వస్తాడని తెలిసి అమ్మ నాగమణి, మూడో అక్క నాగేశ్వరి సైతం కోర్టుకు వచ్చారు. ఐదేళ్ల నుంచి వాయిదాలకు తిరుగుతున్నానని, బాధ భరించలేక ఆత్మహత్య చేసుకుని చనిపోదామని నిర్ణయించుకుని మూడో ఫ్లోర్ నుంచి దూకేసినట్లు బాధితుడు ఫిర్యాదులో పేర్కొన్నారు. వెంటనే పోలీసులు, కుటుంబ సభ్యులు ప్రైవేటు ఆస్పత్రికి, అక్కడ నుంచి జిల్లా కేంద్రాస్పత్రికి తరలించారు. కాళ్లు, చేతులు, తలకు చిన్నపాటి గాయాలయ్యాయని, ప్రస్తుతం అతని ఆరోగ్య పరిస్థితి నిలకడగా ఉందని టూటౌన్ పోలీసులు తెలిపారు.



విజయనగరం జిల్లా కేంద్రాస్పత్రిలో చికిత్సపొందుతున్న త్రిమూర్తులు

## రంగరాజన్ స్వామిపై దాడి విచారకరం

- అన్నమయ్య కళాక్షేత్రం పీఠాధిపతి విజయశంకర స్వామి
- భజన బృందాలతో కలిసి రామనామ సంకీర్తనతో నిరసన

నెల్లిమర్ల రూరల్: ప్రసిద్ధ విష్ణు క్షేత్రం తెలంగాణలోని చిలుకూరి బాలాజీ ఆలయ ప్రధాన అర్చకుడు రంగరాజన్ స్వామిపై జరిగిన దాడిని అన్నమయ్య కళాక్షేత్రం పీఠాధిపతి విజయశంకరస్వామి ఖండించారు. సుప్రసిద్ధ పుణ్యక్షేత్రం రామతీర్థంలో భజన బృందాలతో కలిసి రామనామ సంకీర్తనతో సోమవారం నిరసన తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రామరాజ్యం పేరుతో కొంత మంది వ్యక్తులు రాముడి స్ఫూర్తికి విరుద్ధంగా వ్యవహరిస్తున్నారని విమర్శించారు. శ్రీరాముడు ఎప్పుడూ రాజ్యం కోసం తాపత్రయ పడలేదని గుర్తు చేశారు. రంగరాజన్ స్వామిపై జరిగిన దాడి సాక్షాత్తు శ్రీరాముడిపై జరిగిన దాడిగా పరిగణిస్తున్నామన్నారు. హైందవ ధర్మాన్ని కాపాడేందుకు గ్రామ గ్రామాన రామనామం చేస్తూ తిరిగే భజన బృందాలే నిజమైన రామభక్తులన్నారు. శ్రీరాముడి పేరుతో హిందూ ధార్మిక, ఆధ్యాత్మిక వ్యవస్థలపై దాడులు జరగకుండా ప్రభుత్వాలు చర్యలు చేపట్టాలని డిమాండ్ చేశారు. ధర్మ పరిరక్షణకు రంగరాజన్ స్వామి ఎన్నో కార్యక్రమాలు చేపట్టారని, దేశ వ్యాప్తంగా విశిష్టత కలిగిన వ్యక్తిపై జరిగిన దాడిని అన్ని ధార్మిక సంఘాలు ముక్తకంఠంతో ఖండించాలని కోరారు. కార్యక్రమంలో కళాక్షేత్రం విజయనగరం జిల్లా కన్వీనర్ పతివాడ సత్యనారాయణ, జైభారత్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి రమణ, జైహో రాష్ట్ర ప్రధాన కార్యదర్శి త్రిమూర్తులు పాల్గొన్నారు.

## ఏజెన్సీ బంద్‌కు వైఎస్సార్‌సీపీ సంపూర్ణ మద్దతు

- స్పీకర్ వ్యాఖ్యలు ఉపసంహరించుకోవాలి
- పాలకొండ మాజీ ఎమ్మెల్యే కళావతి




మాట్లాడుతున్న మాజీ ఎమ్మెల్యే కళావతి

సీతంపేట: గిరిజన సంఘాల ఆధ్వర్యంలో ఈ నెల 12న జరగనున్న ఏజెన్సీ బంద్‌కు వైఎస్సార్‌సీపీ సంపూర్ణ మద్దతు ప్రకటించినట్లు పాలకొండ మాజీ ఎమ్మెల్యే విశ్వాసరాయి కళావతి తెలిపారు. స్థానిక ఎంపీపీ కార్యాలయ ఆవరణలో నాయకులతో సోమవారం సమావేశమయ్యారు. అనంతరం ఆమె మాట్లాడుతూ గిరిజన ప్రాంతంలో పర్యాటక అభివృద్ధికి 1/70 చట్టం కారణంగా విఘాతం ఏర్పడుతుందని అసెంబ్లీ స్పీకర్ అయ్యన్నపాత్రుడు చేసిన వ్యాఖ్యలు ఉపసంహరించుకుని గిరిజనులకు క్షమాపణ చెప్పాలన్నారు. ఈ తరహా వ్యాఖ్యలు సరికావని ముఖ్యమంత్రి, ఉపముఖ్యమంత్రి, గిరిజన సంక్షేమశాఖమంత్రి ఖండించకపోవడం విచారకరమన్నారు. రాజ్యాంగ బద్ధంగా కల్పించిన గిరిజన చట్టాలను పకడ్బందీగా అమలు చేయకుండా, గిరిజనులను కించపర్చడం విడ్డూరంగా ఉందన్నారు. చట్టాలను అమలు పర్చాల్సిన బాధ్యత ప్రభుత్వంపై ఉందన్నారు. గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వ హయాంలో అప్పటి ముఖ్యమంత్రి వై.ఎస్.జగన్ మోహన్‌రెడ్డి అహర్నిశలు గిరిజనుల అభివృద్ధి, సంక్షేమానికి కృషిచేశారన్నారు. నాన్‌షెడ్యూల్డ్ ప్రాంతంలో గిరిజన గ్రామాలను షెడ్యూల్డ్ ఏరియాలో చేర్చాలని మా ప్రభుత్వ హయాంలో ప్రతిపాదించామన్నారు. కూటమి ప్రభుత్వం గిరిజన హక్కులను తుంగలో తొక్కడానికి ప్రయత్నిస్తోందని మండిపడ్డారు. దీనికి నిరసనగా చేస్తున్న ఏజెన్సీ బంద్‌కు అందరూ సహకరించాలని కోరారు. కార్యక్రమంలో ఎంపీపీ బి.ఆదినారాయణ, వైస్ ఎంపీపీ కుండంగి సరస్వతి, ఎస్టీ సెల్ జిల్లా అధ్యక్షుడు హిమరక మోహన్‌రావు, సర్పంచ్‌లు కె.వెంకునాయుడు, ఎ.కళావతి, హెచ్.ఆదిలక్ష్మి, ఎస్.సుశీల, ఎన్.తిరుపతిరావు, బి.తిరుపతిరావు, ప్రవీణ్, ఎంపీటీసీలు ఎస్.మంగయ్య, ఎస్.చంద్రశేఖరరావు, జి.కోటేశ్వరరావు, గణేష్, వైఎస్సార్‌సీపీ నాయకులు ఎస్.రాము, ఎస్.కృష్ణ, ఎస్.అబ్బాస్, వెంకీ, ఎస్.మహేష్, వెంకటేష్ తదితరులు పాల్గొన్నారు.

## కలిసికట్టుగా బోదకాలు వ్యాధిని నిర్మూలిద్దాం

బలిజిపేట: ప్రతి ఒక్కరం పరిశుభ్రతను పాటించి కలిసికట్టుగా బోదకాలు వ్యాధిని నిర్మూలిద్దామని కలెక్టర్ శ్యామ్‌ప్రసాద్ తెలిపారు. పెదపెంకిలో బోదకాలు వ్యాధి నివారణ, నులిపురుగుల నివారణ మందులను సోమవారం పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ భవిష్యత్ తరాలకు ఏ ఒక్కరికి బోదకాలు వ్యాధి సోకకుండా నివారించాల్సిన బాధ్యత మన అందరిపైనా ఉందన్నారు. ఒకప్పుడు ఎక్కువగా నమోదయ్యే పోలియో కేసులను నిర్మూలించగలిగామన్నారు. మండలంలో 333 మంది వరకు బోదకాలు వ్యాధి బాధితులు ఉన్నారని తెలిపారు. దీని నివారణకు వైద్యులు, ఎంఎల్‌పీఎస్‌తో కూడిన వైద్య బృందాలను ఏర్పాటు చేసి మైక్రోఫైలేరియా (బోదకాలు) పరీక్షలు రాత్రిపూట నిర్వహించామన్నారు. గ్రామాల్లో తడి, పొడి చెత్త వ్యర్థాలను వేరుచేసి చెత్త నుంచి సంపద తయారు చేసే కేంద్రాలలో వర్మీ కంపోస్టు తయారు చేయించాలని పంచాయతీ కార్యదర్శిని ఆదేశించారు.



బోదకాలుతో బాధపడుతున్న మహిళ కాలును పరిశీలిస్తున్న కలెక్టర్ శ్యామ్‌ప్రసాద్

**పరీక్ష పేలో కలెక్టర్**

ప్రధానమంత్రి నరేంద్ర మోదీ వర్చువల్‌గా నిర్వహించిన పరీక్షపేపై చర్చ ప్రత్యక్ష ప్రసారాన్ని పెదపెంకి ఉన్నత పాఠశాలలో విద్యార్థులతో కలిసి తిలకించారు. విద్యార్థి దశనుంచి ఉన్నత లక్ష్యాలు ఏర్పరచుకుని వాటి సాధనకు ఏకాగ్రత, క్రమశిక్షణతో ముందుకు సాగాలని కోరారు. కార్యక్రమంలో వివిధ విభాగాల అధికారులు శాంతిప్రియ, భాస్కరరావు, తిరుపతినాయుడు, రాబర్ట్‌పాల్, మణి, రత్నకుమారి, విజయలక్ష్మి, సింహాచలం పాల్గొన్నారు.

## పండగ సందడి





గుమ్మలక్ష్మీపురం మండలంలోని చాపరాయి జిన్నిడి, కానసింగి గ్రామాల్లో గిరిజనులు సంప్రదాయ ఛత్తరమ్మ గ్రామ దేవత పండగను సోమవారం ఘనంగా నిర్వహించారు. గ్రామదేవతలకు ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఛత్తరమ్మ, గొడ్డలమ్మను చేతపట్టి డప్పువాయిద్యాలు, సంప్రదాయ నృత్యాల నడుమ గిరిజన గూడల్లో ఊరేగింపుచేశారు. ఆటపాటలతో అలరించారు. - గుమ్మలక్ష్మీపురం

## చదువును దూరం చేయొద్దు



పాఠశాల విలీనం పేరిట పేద, మధ్యతరగతి కుటుంబాల పిల్లలకు చదువును దూరం చేయొద్దని పాలకొండ మండలం యరకారాయపురం గ్రామస్తులు అధికారులను కోరారు. ఊరిలో ఉన్న ప్రాథమిక పాఠశాలను నాగావళి ఆవల ఉన్న చినమంగళాపురం పాఠశాలలో కలిపితే ఊరుకునేది లేదని హెచ్చరించారు. ఈ మేరకు ఎంఈఓ కార్యాలయం వద్ద సోమవారం ధర్నా చేశారు. వర్షాకాలంలో 4, 5 తరగతులు చదువుతున్న చిన్నారులు నదిని ఎలా దాటగలరని ప్రశ్నించారు. యథావిధిగా 5వ తరగతి వరకు ఊరిలోని ప్రాథమిక పాఠశాలను కొనసాగించాలని డిమాండ్ చేశారు. - పాలకొండ రూరల్

## క్లుప్తంగా

### ఈఈఏపీటీలో మక్కువ విద్యార్థినికి 2వర్యాంక్




విద్యార్థిని జ్యోత్స్నకు అవార్డును అందిస్తున్న సీమాట్ డైరెక్టర్ మస్తానయ్య

మక్కువ: ఎడ్యుకేషనల్ ఎంపనీ ఎన్‌జీవో సంస్థ నిర్వహించిన ఈఈఏటీ ప్రతిభా పరీక్షలో మక్కువ జిల్లాపరిషత్ ఉన్నతపాఠశాలలో పదవతరగతి చదువుతున్న ఆర్.జ్యోత్స్న రాష్ట్రస్థాయిలో రెండవర్యాంక్‌ను సాధించింది. ఈ మేరకు సోమవారం విజయవాడలో జరిగిన ప్రతిభా పురస్కార కార్యక్రమంలో సీమాట్ డైరెక్టర్ మస్తానయ్య చేతుల మీదుగా విద్యార్థిని జ్యోత్స్నకు ధ్రువీకరణ పత్రంతో పాటు, మెమెంటో, రూ.25వేల నగదును అందించారు. జ్యోత్స్న గతంలో జరిగిన ఎన్ఎంఎస్ఎస్ ప్రతిభా పరీక్షలో కూడా జిల్లాస్థాయిలో మొదటిస్థానం సాధించింది. విద్యార్థిని జ్యోత్స్న ఈఈఏటీ ప్రతిభా పరీక్షలో రాష్ట్రస్థాయిలో ద్వితీయస్థానం సాధించడంతో, హెచ్ఎం హేమలత, ఉపాధ్యాయులు అభినందనలు తెలియజేశారు.

### భుజంగరావుకు సత్కారం



భుజంగరావును సత్కరిస్తున్న దృశ్యం

రాజాం: మండలంలోని పెనుబాక గ్రామానికి చెందిన బంగారు భుజంగరావును తెలంగాణ విద్యాఫౌండేషన్ ఘనంగా సత్కరించింది. వరంగల్ జిల్లా హన్మకొండలో డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ భవనంలో ఈనెల 9న జరిగిన ఉభయ రాష్ట్రాల దివ్యాంగ కళాకారుల సాంస్కృతిక ఉత్సవంలో భుజంగరావు పాల్గొన్నారు. ఈ ఉత్సవంలో భుజంగరావు పుష్ప-2 సినిమాలోని గంగో రేణుక తల్లీ పాటకు డ్యాన్స్ చేసి అక్కడ ఉన్నవారిని అలరించారు. ఈ క్రమంలో భుజంగరావు టాలెంట్‌ను గుర్తించిన సంస్థ అధినేత బిల్లా మహేంద్రతో పాటు పలు స్వచ్ఛంద సంస్థలు భుజంగరావుకు జ్ఞాపికలు అందించి సత్కరించారు. కార్యక్రమంలో పలువురి టీవీ ఆర్టిస్టులు పాల్గొన్నారు.

### వంశధార నదిలో మునిగి వ్యక్తి మృతి



వంశధార నదీతీరంలో చక్రపాణి మృతదేహం వద్ద రోదిస్తున్న కొడుకు నిరంజన్

భామిని: మండలంలోని బిల్లుమడకు చెందిన కోటిలింగాల చక్రపాణి(70) వంశధార నదిలో మునిగిపోయి సోమవారం మృతి చెందాడు. ఇటీవల భామిని మండలం బిల్లుమడ రేవులో అక్రమంగా నడిపిన ఇసుక ర్యాంప్‌లతో ఇసుక దిబ్బలు గోతులుగా మారి నదినీరు ప్రవేశించింది. ఇదే గోతిలో స్నానానికి దిగిన కోటిలింగాల చక్రపాణి(70) మునిగిపోయి మరణించినట్లు స్థానికులు తెలిపారు. మృతునికి వివాహితుడైన కుమారుడు నిరంజన్, నలుగురు కుమార్తెలు ఉన్నారు. ఈ మరణవార్త తెలుసుకున్న పాలకొండ సీఐ చంద్రమౌళి, బత్తిలి ఎస్సై డి.అనిల్‌కుమార్‌లు బిల్లుమడను సందర్శించి కేసు నమోదు చేసి శవపంచనామా చేశారు.

### విద్యార్థిని ఆత్మహత్య



ఆత్మహత్య చేసుకున్న పువ్వల వాసవి

గుమ్మలక్ష్మీపురం: కురుపాం మండలం జి.శివడ గ్రామానికి చెందిన పువ్వల వాసవి(15) సోమవారం పురుగు మందు తాగి ఆత్మహత్యకు పాల్పడింది. వివరాల్లోకి వెళితే ఒడిశాలోని తులసివలస గ్రామానికి చెందిన వాసవి తల్లి మంగ చిన్నప్పుడే చనిపోగా తండ్రి శ్రీనివాసరావు సమ్మతితో సొంత పిన్ని శకుంతుల, చిన్నాన్న కూర్మారావు పెంచుకుంటూ చదివిస్తున్నారు. గ్రామంలో జరుగుతున్న ఓ శుభకార్యం పనుల్లో అంతా నిమగ్నమై ఉండగా ఇంట్లో ఎవరూ లేని సమయంలో పురుగు మందు తాగేసిన వాసవి తీవ్ర అస్వస్థతకు గురై నోట్లోంచి సొంగ రావడం గమనించిన కుటుంబసభ్యులు హుటా హుటీన మొండెంఖల్లు పీహెచ్‌సీకి తరలించారు. అక్కడి నుంచి మెరుగైన వైద్యం నిమిత్తం భద్రగిరి సీహెచ్‌సీకి తీసుకురాగా అప్పటికే వాసవి మృతి చెందినట్లు వైద్యులు నిర్ధారించారు. వాసవి లంకాజోడులోని ప్రభుత్వ గిరిజన సంక్షేమ బాలికల ఆశ్రమ పాఠశాలలో పదో తరగతి చదువుతోంది. శని, ఆదివారాల్లో గుమ్మలక్ష్మీపురం మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో జరిగిన హిందీ ప్రచార సభ పరీక్షలు రాసేందుకు జి.శివడలోని ఇంటికి వెళ్లి ఇంట్లో నుంచే రెండు రోజుల పాటు పరీక్షా కేంద్రానికి వెళ్లి హిందీ ప్రచార సభ పరీక్షలను రాసింది. తిరిగి పాఠశాలకు సోమవారం దిగబెట్టాల్సి ఉండగా.. ఈ సంఘటన జరిగింది. అయితే వాసవి ఆత్మహత్యకు పాల్పడడానికి గల కారణాలు తెలియరాలేదు. ఈ సమాచారం తెలుసుకున్న ఎల్విన్‌పేట పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు నిర్వహిస్తున్నారు.

# మరుగుదొడ్ల నిధులు మాయం

- డోలపేట హైస్కూల్‌లో నాడు-నేడు పనుల్లో అధికారుల చేతివాటం
- డిపార్ట్‌మెంట్ అధికారులపై జిల్లా అధికారులకు ఫిర్యాదు
- ఆలస్యంగా వెలుగులోకి వచ్చిన ఘటన

రాజాం: పట్టణపరిధిలో డోలపేట జెడ్పీ హైస్కూల్‌లో ఆధునికీకరణ నిమిత్తం మంజూరైన నాడు-నేడు నిధుల్లో గోల్‌మాల్ వ్యవహారం కనిపిస్తోంది. రూ. 3 లక్షలు నిధులు కాంట్రాక్టర్‌కు చెల్లించకుండా మాయమైన ఘటన ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. దీనిపై జిల్లా ఉన్నతాధికారులకు ఫిర్యాదు వెళ్లడంతో ఈ ఘటన బయటకు తెలిసింది. మాయమైన నిధుల వ్యవహారంలో సంబంధిత డిపార్ట్‌మెంట్ అధికారుల హస్తం ఉన్నట్లు తెలుస్తోంది. మాయమైన నిధులు తిరిగి కాంట్రాక్టర్‌కు చెల్లించేందుకు సంబంధిత అధికారులు గడువు కోరినట్లు తెలిసింది. ఆ వివరాలిలా ఉన్నాయి.

☛ డోలపేట జెడ్పీ హైస్కూల్‌లో నూతనంగా ఐదు మరుగుదొడ్ల నిర్మాణం నిమిత్తం 2020 ఏడాదిలో రూ. 5.20 లక్షలు నిధులు మంజూరుచేశారు. నాడు-నేడు ద్వారా పనులు ప్రారంభించారు. అనుకున్న ప్రకారం పనులు పూర్తిచేసినప్పటికీ కాంట్రాక్టర్‌కు రూ. 5 లక్షలు చెల్లించాల్సి ఉండగా, రూ. 2 లక్షలు చెల్లించి, మిగిలిన రూ. 3 లక్షలు చెల్లించేందుకు నిధులు రాలేదంటూ అధికారులు సమయాన్ని కాలయాపన చేశారు. దీంతో చివరిదశలో ఉన్న మరుగుదొడ్ల పనులను కాంట్రాక్టర్ నిలిపివేశాడు. ప్రభుత్వం మారిన తరువాత పెండింగ్‌లో ఉన్న నాడు-నేడు నిధుల విడుదలకు కొంతమంది కాంట్రాక్టర్‌లు కలెక్టర్‌తో పాటు సర్వశిక్షాఅభియాన్ జిల్లా అధికారులకు ఫిర్యాదు చేశారు. ఇందులో భాగంగా పెండింగ్‌లో ఉన్న డోలపేట స్కూల్ నిధులపై ఆరాతీయగా, ఇప్పటికే రూ.5 లక్షలు నిధులు విడుదలైనట్లు రికార్డుల్లో చూపించడంతో సంబంధిత కాంట్రాక్టర్ అవాక్కయ్యాడు. తనకు పూర్తిస్థాయిలో డబ్బులు రాలేదని అధికారుల ఎదుట మొరపెట్టుకోవడంతో పాటు ఈ వ్యవహారంపై నిధులు తినేసిన అధికారులపై చర్యలు తీసుకోవాలని ఎస్ఎస్ఏ జిల్లా అధికారులు, కలెక్టర్‌కు ఫిర్యాదు చేశాడు.



డోలపేట హైస్కూల్

**త్వరలో ఇచ్చేసేందుకు ఒప్పందం**

ఈ నిధుల వ్యవహారం బయటకు రావడంతో మిగిలిన ప్రాంతాల్లోని కాంట్రాక్టర్‌లు కూడా తమకు రావాల్సిన నిధులపై ఆయా పాఠశాలల్లో ఆరాతీయడం ప్రారంభించారు. మరో వైపు డోలపేట జెడ్పీ హైస్కూల్‌లో రూ. 3 లక్షలు నిధులు గోల్‌మాల్ విషయంపై ఉన్నతాధికారులకు ఫిర్యాదు వెళ్లడంతో ఏఈ జగదీష్ కలగచేసుకుని అప్పట్లో నిధులు వచ్చాయని, సకాలంలో విత్‌డ్రా చేయకపోవడంతో వెనక్కు వెళ్లిపోయాయని కాంట్రాక్టర్‌కు నచ్చజెప్పడం ప్రారంభించారు. ఈ నిధులు వారం పదిరోజుల్లో కాంట్రాక్టర్‌కు అందజేస్తామని చెప్పినట్లు తెలిసింది. ఈ విషయంపై కాంట్రాక్టర్‌గా వ్యవహరించిన పాలవలస బాబూరావు వద్ద సాక్షి ప్రస్తావించగా, అప్పట్లో నిధులు వచ్చాయని కనీసం తనకు చెప్పలేదని, నిధులు డ్రా చేసినట్లు ఇటీవల తెలిసిందని ఆరోపించారు. నాడు-నేడు పనులు పర్యవేక్షించిన జేఈతో పాటు అప్పట్లో పాఠశాల హెచ్ఎంగా ఇక్కడ పనిచేసిన ఉపాధ్యాయుడిపై అనుమానాలు ఉన్నాయని, పదిరోజుల గడువును ఏఈ కోరారన్నారు. ఈ గడువులోగా తన డబ్బులు రాకుంటే కోర్టును ఆశ్రయిస్తానని తెలిపారు. ఇదిలా ఉండగా ఈ విషయంపై నాడు-నేడు పనుల జేఈగా వ్యవహరించిన జగదీష్ వద్ద సాక్షి ప్రస్తావించగా, రూ.3 లక్షల నగదు విడుదలలో తేడాలు జరిగినట్లు ఒప్పుకున్నారు. ఈ విషయాన్ని పెద్దది చేయవద్దని కాంట్రాక్టర్‌కు చెప్పామని, వారం పదిరోజుల్లో డబ్బులు చెల్లించే ఏర్పాట్లుచేస్తున్నామన్నారు. ఇన్నాళ్ల కాలయాపనకు కారణాలు చెప్పేందుకు ఏఈ నిరాకరించారు.

## నేడు శంబర పోలమాంబ అమ్మవారి మూడోజాతర

మక్కువ: ఉత్తరాంధ్రుల ఇలవేల్పు శంబర పోలమాంబ అమ్మవారి మూడవ జాతర మంగళవారం జరగనుంది. జాతరకు వచ్చే భక్తుల సౌకర్యార్థం ఆలయ ఈవో వీవీ సూర్యనారాయణ, సీఐ రామకృష్ణలు ఏర్పాట్లు చేపట్టారు. మారుజాతర నాడు, రథసప్తమి పండగ కావడంతో భక్తుల రద్దీ తక్కువగా ఉన్నందున, మూడో జాతరకు భక్తులు అధికంగా వచ్చే అవకాశం ఉంటుందని అధికారులు భావిస్తున్నారు. అందుకు తగినట్లు ఏర్పాట్లు సోమవారం దేవాదాయశాఖాధికారులు నిర్వహించారు. దేవాదాయశాఖ ఆధ్వర్యంలో వనంగుడి, చదురుగుడిల వద్ద క్యూలు ఏర్పాటు చేశారు. క్యూల వద్ద మంచినీటి సౌకర్యం కల్పించారు. భక్తులకు 15వేల లడ్డూ, పులిహోర ప్యాకెట్లు సిద్ధం చేశారు. జాతరలో భక్తులు ఇబ్బందులు పడకుండా సీఐ రామకృష్ణ పర్యవేక్షణలో 100మంది పోలీసులు విధులు నిర్వహించనున్నారు.



శంబర పోలమాంబ అమ్మవారు



జాతర ఆదాయం లెక్కిస్తున్న దేవాదాయ శాఖ సిబ్బంది

**పోలమాంబ హుండీల ఆదాయం రూ.19,16,183**

మక్కువ: ఉత్తరాంధ్రుల ఇలవేల్పు శంబర పోలమాంబ అమ్మవారి చదురుగుడి, వనంగుడిలలో ఏర్పాటు చేసిన శాశ్వత హుండీలను సోమవారం ఈవో వి.వి. సూర్యనారాయణ, ఉత్సవకమిటీ సభ్యులు, గ్రామ పెద్దల సమక్షంలో లెక్కించారు. చదురుగుడి, వనంగుడిలలో 12శాశ్వత హుండీలను లెక్కించగా, చదురుగుడి హుండీల ద్వారా రూ.14,62,984, వనంగుడి హుండీల ద్వారా రూ.4,53,199 మొత్తంగా రూ.19,16,183 ఆదాయం వచ్చినట్లు ఈవో సూర్యనారాయణ తెలిపారు. గతేడాది నవంబర్ 3వతేదీనుంచి ఈ ఏడాది ఫిబ్రవరి 10వతేదీ వరకు హుండీలలో భక్తులు సమర్పించుకున్న కానుకలను లెక్కించినట్లు ఈవో తెలిపారు.

# గిరిజనాభివృద్ధికి ఏం చేశారో చెప్పాలి?

- జగన్‌మోహన్‌రెడ్డిని విమర్శించే హక్కు మంత్రికి లేదు
- మాజీ ఎమ్మెల్యే కళావతి

సీతంపేట: గిరిజన సంక్షేమశాఖ మంత్రి సంధ్యారాణి మంత్రి పదవి చేపట్టాక గిరిజనాభివృద్ధికి ఏం చేశారో చెప్పాలని పాలకొండ మాజీ ఎమ్మెల్యే విశ్వాసరాయి కళావతి డిమాండ్ చేశారు. ఈ మేరకు సీతంపేటలో ఆమె సోమవారం విలేకరులతో మాట్లాడుతూ తన స్థాయిని మరిచి, అధికార దాహంతో మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిపై విమర్శలు చేయడం సరికాదన్నారు. స్కిల్ కళాశాల, సూపర్‌స్పెషాలిటీ ఆస్పత్రి, వందపడకల ఆస్పత్రి అప్‌గ్రేడేషన్, గిరిజన గ్రామాలకు రక్షణ గోడల నిర్మాణం వంటివన్నీ తమ ప్రభుత్వం హయాంలో జరిగినవేనన్నారు. రక్షిత మంచినీటి పథకాలు, మారుమూల గ్రామాలకు రహదారుల నిర్మాణం వంటివి చేపట్టామన్నారు. మీ కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత ఈ ఆరు నెలల కాలంలో ఒక్క పథకమైనా అమలు చేసిందా? అని ప్రశ్నించారు. గిరిజన అభివృద్ధి ప్రదాత మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిని విమర్శిస్తే సహించేది లేదన్నారు. గిరిజనులు తిరగబడే రోజులు తెచ్చుకోవద్దని హెచ్చరించారు. మీ ప్రభుత్వం హయాంలో ఇచ్చిన హామీలను సైతం మీరు నిలబెట్టుకోలేకపోయారన్నారు. గిరిజన విద్యను పూర్తిగా నిర్వీర్యం చేశారని, ఆశ్రమపాఠశాలల్లో హెల్త్‌వలంటీర్‌లను నియమిస్తామని ఇచ్చిన హామీ ఏమైందని ప్రశ్నించారు. ఆశ్రమ పాఠశాలల్లో విద్యార్థులు పిట్టల్లా రాలిపోతుంటే ఏం చేస్తున్నారన్నారు. రోడ్లు కూడా కొత్తవి మంజూరు లేదన్నారు. మా ప్రభుత్వ హయాంలో మంజూరైన రహదారులనే మీరు చెప్పుకుంటున్నారన్నారు. వైద్యసేవలు మృగ్యమవుతున్నాయన్నారు. జీవోనంబర్ 3 అమలుపై మీ స్టాండ్ మార్చలేదా అని ప్రశ్నించారు. ఐటీడీఏలను కూడా నిర్వీర్యం చేసిన ఘనత మీకే దక్కుతుందన్నారు. గిరిజన నిరుద్యోగులకు ఎటువంటి భరోసా లేదని అసహనం వెలిబుచ్చారు. పరిశ్రమలు తెస్తామని చెప్పి ఇంతవరకు ఆ ఊసే లేదన్నారు. ఎన్నికల హామీలన్నీ తుంగలో తొక్కారని విమర్శించారు.



మాజీ ఎమ్మెల్యే కళావతి

# 150 కిలోల గంజాయి పట్టివేత

- కొట్టక్కి చెక్‌పోస్టు వద్ద కారు వదిలి పరారైన డ్రైవర్

రామభద్రపురం: గంజాయి అక్రమరవాణా చేస్తున్న అక్రమార్కులపై రామభద్రపురం పోలీసులు ఉక్కుపాదం మోపారు. ఒడిశా నుంచి అక్రమంగా రవాణాచేస్తున్న 150 కిలోల గంజాయిని కొట్టక్కి వద్ద ఏర్పాటు చేసిన పోలీస్ చెక్ పోస్టు వద్ద పట్టుకున్నారు. సీఐ కె.నారాయణరావు, ఎస్సై వి.ప్రసాదరావుతు తెలిపిన వివరాల ప్రకారం ఆదివారం రాత్రి పెట్రోలింగ్ నిర్వహిస్తున్న క్రమంలో కొట్టక్కి చెక్ పోస్టు వద్ద వాహనాలు చెక్ చేస్తున్నారు. ఇంతలో ఒడిశా నుంచి అక్రమంగా తరలిస్తూ గంజాయితో ఉన్న డస్టర్ కారు డ్రైవర్ కారును జాతీయ రహదారి పక్కన చిన్న రూట్‌లో తప్పించుకుని స్పీడ్‌గా లాగించేశాడు. అప్రమత్తమైన ఏఎస్సై అప్పారావు, పోలీస్‌సిబ్బంది అప్రమత్తమై వెంటాడారు. సరిగ్గా కొట్టక్కి దుర్గమ్మ గుడి వద్దకు వెళ్లేసరికి సరిగా దారి కనిపించకపోవడంతో కారు వదిలేసి డ్రైవర్ పరారయ్యాడు. గంజాయితో ఉన్న కారును, అందులో ఉన్న 150 కిలోల గంజాయి(74 ప్యాకెట్లు)ని స్వాధీనం చేసుకున్నారు.కారులో ఉన్న పొల్యూషన్ సర్టిఫికెట్ పరిశీలించగా ఢిల్లీ రిజిస్ట్రేషన్‌తో ఉందని, ప్రస్తుతం ఫేక్ నంబర్ ప్లేటు బోర్డు ఉన్నట్లు పోలీసులు గుర్తించారు. ఎస్సై వి ప్రసాదరావు కేసు నమోదు చేయగా సీఐ కె.నారాయణరావు దర్యాప్తుచేస్తున్నారు.

## నటుడు తిరుపతిరావుకు ఇంటర్నేషనల్ ఫిల్మ్ ఫెస్టివల్ టాలెంట్ అవార్డ్

విజయనగరం టౌన్: విజయనగరం జిల్లా బాడంగి మండలం, గొల్లాది గ్రామానికి చెందిన ప్రముఖ రంగస్థల, సినీ నటుడు, నంది అవార్డు గ్రహీత దాసరి తిరుపతిరావు హైదరాబాద్ పొట్టిశ్రీరాములు తెలుగు విశ్వవిద్యాలయం, ఎన్‌టీఆర్ ఆడిటోరియంలో ఆదివారం రాత్రి ఇంటర్నేషనల్ ఫిల్మ్ ఫెస్టివల్, టాలెంట్ అవార్డ్ అందుకున్నారు. ఈ మేరకు సోమవారం ఆయన జిల్లా కేంద్రంలో నిర్వహించిన కార్యక్రమంలో వివరాలు వెల్లడించారు. 44 ఏళ్లుగా నాటకరంగంలో అనుభవం ఉన్న తాను రెండు నంది అవార్డులతో పాటూ మూడు గోల్డ్‌మెడల్స్ సాధించానని, 18 సినిమాల్లో నటించినట్లు తెలిపారు. ఆర్.నారాయణ మూర్తి తీసిన యూనివర్సిటీలో మెయిన్ విలన్ పాత్రపోషించానని చెప్పారు. సుమన్‌తో విత్‌పవర్ సినిమాలో విలన్ కేరక్టర్ చేశానన్నారు. ఇంటర్నేషనల్ ఫిల్మ్‌ఫెస్టివల్‌లో తనకు ఉత్తమ విలన్, కేరెక్టర్ ఆర్టిస్ట్‌గా అవార్డును దర్శక, నిర్మాత, యాంకర్, ఎడిటర్ గుర్రపు విజయకుమార్, నిర్మాత రామసత్యనారాయణ, ఎంపీ వేణుగోపాల్, దర్శక, నిర్మాత వంశీకృష్ణ తదితరులు అవార్డు అందజేశారని తెలిపారు. ఈ సందర్భంగా తిరుపతిరావును పలువురు అభినందించి, హర్షం వ్యక్తం చేశారు.



ఉత్తమ విలన్, క్యారెక్టర్ ఆర్టిస్ట్‌గా అవార్డు అందుకుంటున్న దాసరి తిరుపతిరావు

## సాహితీ వేత్త పీవీబీ శ్రీరామమూర్తి అస్తమయం



పీవీబీ శ్రీరామ్మూర్తి మాస్టారు (ఫైల్)

పార్వతీపురంటౌన్: ప్రముఖ సాహితీవేత్త, తెలుగు భాష ఉపాధ్యాయుడు పీవీబీ శ్రీరామ్మూర్తి మాస్టారు ఆదివారం సాయంత్రం తమ స్వగృహంలో తుదిశ్వాస విడిచారు. పార్వతీపురం ఆర్‌సీఎం బాలుర ఉన్నత పాఠశాలలో తెలుగు భాష ఉపాధ్యాయుడిగా 30 దశాబ్దాలకు పనిచేసిన పీవీబీ శ్రీరామమూర్తి మాస్టారు ఇక లేరు. తెలుగు భాష ఉపాధ్యాయుడిగా పనిచేస్తూ తెలుగు భాషపై ఉన్న అభిమానంతో పార్వతీపురంలో 1980 ప్రాంతంలో పంతులు జోగారావు, పంతులు సీతాపతి, బెలగాం భీమేశ్వరరావు, శిష్టా హరిగోపాలరావు, మంచిపల్లి శ్రీరాములు సహాయ సహకారాలతో అభ్యుదయ సాహితీ అనే సంస్థను నెలకొల్పి సాహితీ సేవలను అందించారు. తరువాత అనతి కాలంలో అది పార్వతీపురం రచయితల సంఘంగా పేరు మార్చుకుంది. శ్రీరామ్మూర్తి మాస్టారు మరణంపై సాహితీ లహరి వ్యవస్థాపకుడు మంచిపల్లి శ్రీరాములు మాట్లాడుతూ పార్వతీపురం ఒక మంచి సీనియర్ కథా రచయితను కోల్పోయిందని విచారం వ్యక్తం చేశారు. పట్టణ ప్రముఖ రచయితలు గంట్యాడ గౌరినాయుడు, బాల సాహిత్య నిలయం వ్యవస్థాపకుడు ఎం.పార్థసారథి పలువురు సాహితీ వేత్తలు ఆయన మరణం సాహితీ లోకానికి తీరని లోటుగా అభివర్ణించారు. ఆయన కుటుంబసభ్యులకు తమ ప్రగాఢ సానుభూతి తెలియజేశారు.

## ముగ్గురికి గాయాలు

గుర్ల: మండలంలోని దేవునికణపాక వద్ద బాణసంచా తయారీ కేంద్రం పరిసర ప్రాంతాల్లో బాణసంచా తయారీకి ఉపయోగించే ఒత్తులను కూలీలు ఆదివారం ఆరబెట్టారు. ఒత్తులు తడిగా ఉన్నాయని వాటికి అగ్ని అంటించడంతో ఒక్కసారిగా మంటలు చెలరేగి ముగ్గురికి తీవ్ర గాయాల య్యాయి. గాయాల పాలైన వారిలో గవిడిపేటకు చెందిన సింగరాపు సుబ్రహ్మణ్యం, తాడ్డి రమణ. గుషిడి సూర్యనారాయణ ఉన్నారు. జిల్లా కేంద్రంలోని ప్రైవేట్ ఆస్పత్రిలో చికిత్స పొందుతున్నారు.

# రామతీర్థంలో నేడు రథయాత్ర

- ఏర్పాట్లు పూర్తి చేసిన దేవస్థానం సిబ్బంది
- తిరువీధుల్లో ఊరేగనున్న సీతారామ చంద్ర మూర్తి



స్వామివారి ఉత్సవ విగ్రహాలు

నెల్లిమర్ల రూరల్: సుప్రసిద్ధ పుణ్యక్షేత్రం రామతీర్థంలో మంగళవారం రాత్రి రథయాత్ర మహోత్సవాన్ని అంగరంగ వైభవంగా నిర్వహించనున్నారు. రథసప్తమి పర్వదినాన్ని పురస్కరించుకుని స్వామివారి పందిరి రాట రోజునే సీతారామునిపేట గ్రామస్తులు రథాన్ని ఆలయం వద్దకు తీసుకువచ్చారు. స్వామి వారి రథాన్ని నూతన హంగులతో సుందరంగా తీర్చిదిద్ది రథయాత్రకు సిద్ధం చేశారు. ఏటా మాఘమాసంలో నిర్వహించే రథయాత్రకు విశేష ప్రాముఖ్యం ఉంది. కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించేందుకు దేవస్థానం అధికారులు అన్ని ఏర్పాట్లు పూర్తిచేశారు. రాత్రి 10గంటలకు రథంలో సీతాసమేత శ్రీరామచంద్ర ప్రభువును అధిష్టించి రామతీర్థం పురవీధుల్లో మంగళవాయిద్యాలు, అశేష భక్తజనం నడుమ ఊరేగించనున్నారు. మూడు గంటల పాటు జరిగే రథయాత్ర మహోత్సవం సజావుగా సాగేందుకు పోలీసులు ప్రత్యేక బందోబస్తు నిర్వహించనున్నారు.



రథయాత్రకు సిద్ధమైన స్వామివారి రథం

**తిరు వీధుల్లో ఊరేగనున్న స్వామివారు**

ఉత్తర రాజగోపురం సమీపంలో కల్యాణ వేదికపై సీతారామస్వామి ఉత్సవ మూర్తులకు ప్రత్యేకపూజలు జరిపించిన అనంతరం సాయంత్రం 6 గంటలకు స్వామివారి ఊరేగింపునకు ముందు పండిత పరిషత్ ఎంతో వైభవంగా జరిపిస్తారు. ఈ పరిషత్‌లో సీతారాముల గుణగణాలను తెలియపర్చడానికి వేదపండితులు పోటీపడతారు. అనంతరం రాత్రి 10గంటలకు రథం రామతీర్థం తిరువీధుల్లో ఊరేగింపునకు బయలుదేరుతుంది. ఉత్తర రాజగోపురం ఎదురుగా ప్రారంభమై ప్రధానరహదారి నుంచి కుమ్మరికానా వరకు వెళ్లి అక్కడినుంచి తిరువీధి మార్గం ద్వారా ఆలయం వరకు స్వామివారి యాత్ర కొనసాగుతుంది. సీతారామునిపేట, గొర్లిపేట, జగ్గరాజుపేట గ్రామాలకు చెందిన భక్తులు స్వామివారి రథాన్ని లాగడం ఏటా ఆనవాయితీగా వస్తోంది. రథం ముందుకు సాగుతున్నప్పుడు భక్తులు రథం పైకి అరటి పళ్లు విసురుతూ మొక్కులు చెల్లించుకుంటారు.

# క్రీడలకు ఎంతో ప్రాధాన్యం

- వెటర్నరీ కళాశాల వైస్ చాన్స్‌లర్ జేవీ రమణ
- ప్రారంభమైన వెటర్నరీ పాలిటెక్నిక్ కళాశాలల క్రీడాసాంస్కృతిక పోటీలు

చీపురుపల్లిరూరల్(గరివిడి): క్రీడలకు వెటర్నరీ విశ్వవిద్యాలయం ఎంతో ప్రాధాన్యం కల్పిస్తుందని, విద్యార్థులు క్రీడల పట్ల ఆసక్తిని పెంపొందించుకునేందుకు అన్ని విధాలా సహాయ సహకారాలు అందిస్తామని తిరుపతి వెంకటేశ్వర వెటర్నరీ యూనివర్సిటీ వైస్ చాన్స్‌లర్ డా.జీవీ రమణ అన్నారు. గరివిడి పశువైద్య కళాశాలలో 12వ రాష్ట్రస్థాయి అంతర వెటర్నరీ పాలిటెక్నిక్ కళాశాలల క్రీడా సాంస్కృతిక పోటీలు సోమవారం ఆరంభమయ్యాయి. ఈ ప్రారంభ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన ఆయన మాట్లాడుతూ రానున్న రోజుల్లో పశువైద్య కళాశాలలో క్రీడా ప్రాంగణంతో పాటు వివిధ రకాల క్రీడలకు అవసరమైన మౌలిక వసతులతో కూడిన సదుపాయాలను అభివృద్ధి చేసేందుకు చర్యలు తీసుకుంటామని తెలిపారు. విద్యార్థులు గెలుపోటములు చూడకుండా క్రీడల్లోను, చదువులోను ప్రతిభ కనబరచాలని సూచించారు. గరివిడిలోని పశువైద్య కళాశాల రాష్ట్రస్థాయి వెటర్నరీ, పాలిటెక్నిక్ అంతర కళాశాలల పోటీలకు వేదికగా నిలవడం ఎంతో ఆనందదాయకమన్నారు. ఈ సందర్భంగా క్రీడా కార్యక్రమాలకు తమ వంతు సహాయసహకారాలు అందజేస్తున్న గరివిడి పశువైద్య కళాశాల అసోసియేట్ డీన్ మక్కేన శ్రీనును అభినందించారు. ఏఎస్పీ డా.వి.సన్యాసిరావు మాట్లాడుతూ విద్యార్థులు ఎప్పుడూ చదువుతో పాటుగా క్రీడల పట్ల కూడా తమ ప్రతిభను కనబరచాలని పిలుపునిచ్చారు. క్రీడలు మానసికంగా, శారీరకంగాను ఎంతో దృఢత్వాన్ని ఇస్తాయన్నారు. గరివిడి ఫేకర్ సీఈఓ ఎంఎస్ఎస్.శర్మ మాట్లాడుతూ విద్యార్థులు చదువుల్లోను, క్రీడల్లోను ఆసక్తి చూపాలని, విద్యార్థులు జంతువుల పట్ల ఆదరాభిమానాలు కలిగి ఉండాలన్నారు.



క్రీడా సాంస్కృతిక పోటీలను ప్రారంభిస్తున్న వైస్‌చాన్స్‌లర్, ముఖ్య అతిథులు తదితరులు



క్రీడా సాంస్కృతిక పోటీల్లో పాల్గొన్న పలు కళాశాలలకు చెందిన విద్యార్థులు

**నాలుగు రోజుల పాటు క్రీడాపోటీలు**

కళాశాల ప్రాంగణంలో ఈనెల 10 నుంచి 13 వ తేదీ వరకు నాలుగు రోజుల పాటు జరగనున్న క్రీడా సాంస్కృతిక పోటీల్లో క్రికెట్, వాలీబాల్, ఖోఖో, కబడ్డీ, టేబుల్‌టెన్నిస్, బాస్కెట్‌బాల్, క్యారమ్స్ క్రీడాపోటీలతో పాటు సాంస్కృతిక పోటీలు జరుగుతాయని తెలిపారు. ఈ పోటీల్లో రాష్ట్రవ్యాప్తంగా ఉన్న 10 వెటర్నరీ పాలిటెక్నిక్ కళాశాలలు వెన్నెలవలస, గరివిడి, రామచంద్రాపురం, వీఆర్‌గూడెం, రాపూరు, సదుం, పలమనేరు, కొమ్మెమరి, బనవాసి, మడకశిర కళాశాలల నుంచి 240 మంది క్రీడాకారులు పాల్గొననున్నారు.

# పోక్సో కేసులో ముద్దాయికి శిక్ష ఖరారు

విజయనగరం క్రైమ్: విజయనగరం జిల్లా పూసపాటిరేగ పోలీస్‌స్టేషన్‌లో 2024లో నమోదైన పోక్సో కేసులో నిందితుడు పూసపాటిరేగ మండలం పెదతాడివాడ గ్రామానికి చెందిన మైనపు హరీష్‌కు పోక్సో కోర్టు ప్రత్యేక న్యాయమూర్తి కె.నాగమణి ఏడేళ్ల కఠిన కారాగార శిక్ష, రూ. 3వేల జరిమానా విధిస్తూ సోమవారం తీర్పు వెల్లడించినట్లు ఎస్పీ వకుల్ జిందల్ పేర్కొన్నారు. పూసపాటిరేగ మండలం పెదతాడివాడ గ్రామానికి చెందిన మైనపు హరీష్ అదే గ్రామానికి చెందిన ఐదేళ్ల బాలికపై 2024 నవంబరు 11న లైంగిక దాడికి పాల్పడినట్లు బాలిక తల్లి ఇచ్చిన ఫిర్యాదు మేరకు పూసపాటిరేగ ఎస్సై ఐ.దుర్గాప్రసాద్ కేసు నమోదుచేసి దర్యాప్తు చేపట్టారన్నారు. నిందితుడు హరీష్‌పై నేరారోపణలు రుజువు కావడంతో విజయనగరం స్పెషల్ జడ్జి ఫర్ పోక్సో కోర్టు కె.నాగమణి పై విధంగా తీర్పు వెల్లడించినట్లు తెలిపారు.

# తరగతులకు వెళ్లండి



దీక్షా శిబిరంలో విద్యార్థులతో మాట్లాడుతున్న వైస్ చాన్స్‌లర్ జేవీ రమణ

- వైస్‌చాన్స్‌లర్ జేవీ రమణ

చీపురుపల్లిరూరల్(గరివిడి): వెటర్నరీ విద్యార్థులు ముందుగా తరగతులకు వెళ్లండి. సమయాన్ని వృథా చేయవద్దు. మీ సమస్యల పరిష్కారానికి మా వంతు కృషి చేస్తామని తిరుపతి శ్రీ వెంకటేశ్వర వెటర్నరీ యూనివర్సిటీ వైస్‌చాన్స్‌లర్ జేవీ రమణ అన్నారు. గరివిడి వెటర్నరీ కళాశాలకు చెందిన విద్యార్థులు వీసీఐ గుర్తింపు తీసుకురావాలని, తమకు ప్రస్తుతం ఇస్తున్న రూ.7500 స్టైపెండ్‌ను రూ.25వేలకు పెంచాలని డిమాండ్ చేస్తూ వారం రోజులుగా వెటర్నరీ కళాశాల ఆవరణలో నిరవధిక దీక్ష చేపడుతున్న విషయం తెలిసిందే. ఇదే కళాశాలలో సోమవారం ప్రారంభమైన 12వ రాష్ట్రస్థాయి అంతర్రాష్ట్ర సాంస్కృతిక కళాశాలల పోటీల కార్యక్రమంలో ముఖ్య అతిథిగా పాల్గొన్న వైస్ చాన్స్‌లర్ విద్యార్థుల నిరవధిక దీక్షా శిబిరానికి వచ్చి వారితో మాట్లాడారు. డిమాండ్ల పరిష్కారం కోరుతూ విద్యార్థులు చేపడుతున్న ధర్నాతో వెనువెంటనే సమస్యలు పరిష్కారం కావన్నారు. కాలక్రమేణా సమస్యలు పరిష్కారమవుతాయని చెప్పగా విద్యార్థులు మాట్లాడుతూ ఎంబీబీఎస్ విద్యార్థుల మాదిరిగానే మేమంతా కూడా పశువైద్యంలో మూగజీవాలకు సేవచేస్తున్నామని, ప్రభుత్వం చెల్లించే స్టైపెండ్ ఏమాత్రం సరిపోవడం లేదని తెలియజేశారు.మా డిమాండ్లు పరిష్కారం జరిగే వరకు నిరవధిక దీక్షా శిబిరాలు కొనసాగిస్తామన్నారు. దీనికి వీసీ మాట్లాడుతూ మీ డిమాండ్ల పరిష్కారం కోరుతూ మీరు అందించిన లెటర్‌ను యానిమల్ హస్బెండరీ ప్రిన్సిపల్ సెక్రటరీకి పంపిస్తామని తెలిపారు.



యువయోర్చా అధ్యక్షుడు మిట్టా కృష్ణకు వినతిపత్రం అందజేస్తున్న వెటర్నరీ కళాశాల విద్యార్థులు

**ఉన్నతాధికారుల దృష్టికి విద్యార్థుల సమస్యలు**

వెటర్నరీ కళాశాలలో నిరవధిక దీక్ష చేపడుతున్న వెటర్నరీ విద్యార్థుల సమస్యలను ఉన్నతాధికారుల దృష్టికి తీసుకువెళ్లి వారి సమస్యల పరిష్కారానికి కృషి చేస్తామని బీజేపీ యువమోర్చా రాష్ట్ర అధ్యక్షుడు మిట్టా వంశీకృష్ణ అన్నారు. వెటర్నరీ కళాశాల ప్రాంగణంలో విద్యార్థులు చేపడుతున్న నిరవధిక దీక్షా శిబిరాన్ని సోమవారం ఆయన సందర్శించి విద్యార్థులతో మాట్లాడి వారి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. విద్యార్థుల సమస్యలను రాష్ట్రం, కేంద్రంలో ఉన్నతాధికారుల దృష్టికి తీసుకువెళ్తామన్నారు. సమస్య పరిష్కారం జరిగే వరకు వెనువెంటే ఉంటామని హామీ ఇచ్చారు. అంతకుముందు కళాశాలలో వైస్ చాన్స్‌లర్, అసోసియేట్ డీన్‌ను కలిసి మాట్లాడారు. కార్యక్రమంలో బీజేపీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి నవనీత్‌రెడ్డి, చీపురుపల్లి నియోజకవర్గం కన్వీనర్ మన్నెపూరి శ్రీనివాసరావుతో పాటు పలువురు నాయకులు పాల్గొన్నారు.